


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## బాలల చిత్రాలు

**కమలత్తయ్య వెళ్తూ వెళ్తూ** ఐదు రూపాయల నోటు నా చేతిలో పెట్టి 'ఏదైనా కొనుక్కో' అని గుసగుసగా చెప్పి వెళ్ళింది. నాకు గుండెలు ఒక్క క్షణం ఆగి గుబగుబా కొట్టుకున్నాయి. నాకుఎనిమిదేళ్ళు, ఎప్పుడైనా అమ్మ పది పైసల బిళ్ళా, నాన్న పావలా తప్ప ఇంత పెద్ద మొత్తం అప్పటిదాకా ఎవరూ ఇవ్వలేదు. జ్వరం వస్తే మాత్రం, పక్కన ఓ డబ్బా పెట్టి, అందులో చిల్లర డబ్బులు, ఐదు పైసలూ, మూడు పైసలూ, ఒక్కోసారి నయాపైసా, రెండుపైసలూ.. నేను ఏడుస్తుంటే, పావలా కాసుకూడా అమ్మమ్మ అందులో వేసి, "జ్వరం తగ్గగానే ఐస్‌ఫ్రూటూ, జీళ్ళూ, పిప్పరమెంట్లూ కొనుక్కో" అని ఊరడించేది. అప్పుడు అవి రెండు రూపాయిలు అయితేనే సందానీ, చిట్టీ, బుజ్జీ ముందు బోలెడు పోజులు కొట్టేదాన్ని. అలాంటిది ఇప్పుడు ఐదు రూపాయలు అచ్చంగా నా స్వంతం.

సందానీ తల్లి రోజంతా బీడీలు చేస్తే ఆ రోజుల్లో రోజుకి మూడూ, లేదా ఐదూ ఇచ్చేవారు. కేరేజీలు బుట్టలో పెట్టుకుని, మధ్యాహ్నం భోజనాల టైంకి సిగరెట్ ఫ్యాక్టరీకి తీసుకెళ్ళే ఆశమ్మకి క్యారేజీకి పది రూపాయలు నెలకి ఇచ్చేవారు. అంతెందుకు రోజూ రెండుపూటలా వచ్చి అంట్లు తోమి, ఇల్లూ వాకిలీ వూడ్చి వెళ్ళే మా శ్యామలమ్మకి పదినుండి పన్నెండు రూపాయలు నెల జీతం.

రిక్షా ఎక్కితే రూపాయీ, రూపాయి పావలా మా ఇంటి నుండీ సికింద్రాబాద్ స్టేషన్‌కి బస్‌లో వెళ్తే పది పైసలు టికెట్. ఆ రోజుల గురించి మాట్లాడ్తున్నాను. సరే! అత్తయ్య రిక్షా అటువెళ్ళగానే ఇటు మరియన్ ఆంటీ ఇంటి వరండా మీదకి పరిగెత్తాను. అప్పటికే నాలుగు గుంజల ఆట ఆడడానికి చిట్టీ, బుజ్జీ, వినోలియా, ఇంకో హేండ్ తక్కువై నాకోసం చూస్తున్నారు. నేను వగరుస్తూ "సందానీగాడేడే?" అన్నాను.

"ఇందాక వాళ్ళ నాన్న కొట్టుకుంటూ ఇటునుండి గెడ్డ మీద కొట్టుకి తీసుకెళ్ళాడే!" అంది వినీలియా.

"సరే మనం ముగ్గురం ఆదివారం సినిమాకి వెళ్దాం. సువర్ణ సుందరి లేదా కీలుగుర్రం.. బాలాజీ టాకీస్‌లో మార్నింగ్ షోకి" అన్నాను.

అంత పాత సినిమాలయితేనే, అర్ధరూపాయి టికెట్‌కి మార్నింగ్ షో వేసేవారు.

"ఇంత చిన్న పిల్లల్ని రానిస్తారా?" బుజ్జి అడిగింది.

"మా శ్యామలమ్మని తీసుకెళ్తాంగా కూడా" అన్నాను.

"అమ్మో టికెట్ లేకుండా వెళ్తే పోలీసులు తీసుకెళ్ళిపోతారు" చిట్టీ భయంగా అంది.

"నేను డబ్బులు తెచ్చాను" గర్వంగా అన్నాను. మీ అమ్మ బ్యాగ్‌లోంచా?" అని వినోలియా అడిగింది.

పావలా దొంగతనం చేస్తే ఎంత గాభరా వేసిందో నేనింకా మర్చిపోలేదు. "ఛ! దొంగతనం కాదు. మా అత్తయ్య ఇచ్చింది. సినిమా ఇంటర్వెల్‌లో పల్లీలు కూడా కొనుక్కుందాం" అన్నాను.

"సందానీగాడు కూడానా?" చిట్టి అడిగింది.

"ఔను! ఏడివాడూ?" మళ్ళీ సందానీ గుర్తొచ్చాడు. రాజులూ, రాణులూ సినిమాలు వాడితో వెళ్ళకపోతే, వచ్చాకా ఇంట్లో సినిమా వేసేటప్పుడు, రాజకుమార్తెని ఎత్తుకెళ్ళే రాక్షసుడి వేషం ఎవరు ఏస్తారు మరీ? అందుకని వాడిని కూడా తీసుకెళ్ళాలి.

"ఎన్ని డబ్బులిచ్చిందే మీ అత్త?" వినోలియా అడిగింది.

"చా...లా.." అని చెప్పాను. తల గుండ్రంగా తిప్పుతూ.

"మా అత్త కూడా చాలా డబ్బులిచ్చేది. కానీ ఇప్పుడు లేదు" అంది బుజ్జి.

"ఎక్కడికెళ్ళిందీ?"

"చచ్చిపొయింది" అంది.

"పాపం!" నేను దానిని ఓదార్చాను.

"నాకు పీచు మిఠాయి కూడా కొని తెచ్చేది" అంది ఏడుస్తూ.

"ఏడవకు. పీచు మిఠాయి కూడా కొనుక్కుందాం" అన్నాను.

"పది పైసలు పెట్టి, మూర మల్లెపూలు కొనుక్కుని పెట్టుకుందామా?" వినోలియా అడిగింది. అది మా కన్నా పెద్దది. స్టైల్స్ ఎక్కువ.

"నీ కోరికలన్నీ నేను తీర్చలేను" కరాఖండీగా చెప్పేసా.

"సరే ఈ విషయం సందానీగాడికి కూడా చెప్పు" అంది చిట్టి.

"అవును.. ఏడీ? అని గెడ్డమీద కొట్టుకేసి పరిగెత్తాను.

సలీం సైకిల్ షాప్ వుంటుంది మర్రి చెట్టు కింద. సైకిళ్ళన్నింటికీ ఒక దానితో ఒకటి చైన్ కట్టి తాళాలు వేసి, రాజకుమార్తెల ప్రాణాలన్నీ చెట్టు తొర్రలో దాచినట్లు దాస్తాడు సలీం.

ఎర్రని రాక్షసుడి కళ్లలా వుంటాయి అతని కళ్ళు. పై నుండి నోట్లో ఎప్పుడూ బీడీ. మెడకి ఎర్ర మఫ్లర్, కన్నాల కన్నాల బనీన్, నెత్తిమీద క్రోషా అల్లిన టోపీ. మాంసం దుకాణం కూడా అతనిదే, పైన వేళాడదీసిన మాంసాలు చూస్తే నాకు భయం. అతను పెద్ద కత్తితో 'కచపచ ' మాంసాన్ని కొడ్తున్నాడు.. నేను అటు చూడకుండా, వీలైతే కళ్ళు మూసుకుని, అతని కొట్టుని దాటేస్తాను.

"ఏయ్ బుజ్జీ .. చాక్‌లెట్ ఇస్తా.. ఇటు రా" అని పిలుస్తాడు.

నేను అటు చూస్తే నాకు భయం. పరిగెత్తుకుంటూ వెళ్ళిపోతా. అతని చేతికి దొరికితే, నన్నూ అలా పైన మాంసంలా వేలాడదీస్తాడేమోనన్నంత భయం.

"ఏ లడ్‌కీ.. ఇదర్ ఆ.." అని నవ్వుతున్నాడు సలీం.

నేను మర్రిచెట్టు దాటి పరిగెడ్తున్నాను.

"ఏ.వీ రమణీ!" సందానీగాడు అరుపు వినిపించింది.

నేను ఆగి చుట్టూ చూసాను. మర్రి చెట్టుమీద కూడా చూసాను. లేదు.

"ఏ.వీ రమణీ..." నెమ్మదిగా చెట్టుచాటునుండి వచ్చాడు. వాడి బుగ్గలమీద చేతివేళ్ళ ముద్రలు. వాళ్ళ నాన్న బాగా కొట్టినట్లున్నాడు. బుగ్గల మీద మురికితో కలిపిన వాడి కన్నీటి చారలు నల్లగా.

"ఏమైందిరా?" అన్నాను.

"నాదీ నాయినా, మళ్ళీ వస్తాయి, కింద వెతుకు.. పైసలు పోయినాయి."

"నాయినా నాలుగు రూపాయలిచ్చి, సిగరెట్ ప్యాకెట్, బన్ తీస్కరమ్మన్నాయి. నేను నా నిక్కర్ జోబీల వేస్కున్నాయి.. ఇంటి కెల్లి  కొంత దూరం వచ్చినా.. ఈడ కోతులుని ఆడించేటోడు కనిపించినయ్. ఆ కోతిని డాన్సింగ్ చెయ్యమంటే జ్యోతిలక్ష్మిలాగా మస్తు ఆడింది. నీ అత్తగారికి నీళ్ళు తెయ్యి అంటే కుండ ఇరగ్గొట్టింది. అమ్మగారికి నీళ్ళు తెయ్యి అంటే, నీ లెక్క మస్తు కుషీగా చెంబు నెత్తి మీద పెట్టి, తిప్పుకుంటూ తెచ్చింది..."

నాకు ఒళ్ళు మండింది. "మధ్యలో కోతి నాలాగా తేడమేవిట్రా? సరే.. నీ డబ్బులు ఎలా పోయాయి?" అన్నాను.

"గీడనే మంది చుట్టుముట్టూ మూగిన్రు. నేను భీ చూస్తున్నా. నా లాగూకి చిల్లి వుంది. పైసలు జారిపోయినయ్. ఆట అయిపోయినంక దుకాన్‌కి పోతే.. జేబుల పైసలు లెవ్వు" అని ఏడ్చాడు.

"నీ తలకాయ్.. నువ్వు కోతులని చూస్తూ ఒళ్ళు మరిచిపోతే, ఎవడో నీ డబ్బులు కొట్టేసి వుంటాడు" అన్నాను.

"ఇప్పుడు నాయిన వస్తే నాకో కొడ్తయ్.. ఎక్కడ పోగొట్టుకున్నవో, ఎదికి తెమ్మన్నయ్" అన్నాడు.

"ఎప్పుడొస్తాయ్?" అని నుదురు కొట్టుకుని "ఎప్పుడొస్తాడు మీ నాన్నా?" అని అడిగా. వాడితో పదినిమిషాలు మాట్లాడితే, మా చిన్న తెలుగు పండిటే" నాకీ ఉత్తరీయం ఎక్కడున్నయ్?" అని పెళ్ళాన్ని అడిగేటంత తెలుగు నీ తెలివినీ పోగొట్టుకున్నారు..

"చాయ్ తాగొస్తా అని హోటేల్‌లకి పోయినయ్" అన్నాడు. సందానీ తండ్రి వస్తే వీడి తాట మళ్ళీ వలిచేస్తాడు. ఏం చేద్దాం.. అని ఆలోచిస్తుంటే, సందానీ తండ్రి వస్తూ కనిపించాడు.

"మీ నాన్నగారొస్తున్నారు" అన్నాను కంగారుగా.

"ఆయనెవలు?" అడిగాడు వాడు.

"అదేరా.. మీ నాయినొస్తున్నయ్" అన్నాను.

"అమ్మో! సంపేస్తాడు నాకీ... నేను సచ్చిపోతే నా బిజిలీకి నువ్వే తీసుకో.. రోజు గడ్డిపెట్టు..."

వీడు వీలునామా రాసేస్తున్నాడు నా పేరు మీద ఆస్తులన్నీ..." నా ఇంట్ల అటక మీద, గాజు డబ్బాల నూటిరవై గోలీలున్నై, పక్కన డబ్బాల బచ్చాలున్నయ్.. అయన్నీ నీవే"

"సరే లేరా..ఊరుకో.. నువ్వేం చావవు" అన్నాను.

"నీకీ తెల్వద్. మా నాయిన కొత్త బెల్ట్ కొన్నయ్.. దానికీ ఇంత దొడ్డు ఇనప బకిల్ వున్నయ్. నాదీ చెమ్డా లెక్కదీస్తడు.. రకతం బయట కెళ్తుంది.." అని ఏడుస్తున్నాడు.

సందానీ తండ్రి నడకలో మార్పు తెలుస్తోంది. రోడ్డు అంతా కొల్చే సర్వే ఇంజనీర్లా.. అటునుండి ఇటూ, ఇటు నుండి అటూ రోడ్డు మీద తూలుతున్నాడు.

"మీ నాయిన చాయ్ తాగడానికెళ్ళాడా లేక ఇంకేమైనా తాగడానికి వెళ్ళాడా?" అడిగాను.

"చాయ్ అని చెప్పినయ్" అన్నాడు.

"సరే! ముందు ఈ డబ్బులు నీదీ నాయిన కియ్యి" అని నా గౌను జేబులోంచి ఐదు రూపాయిలు తీసి సందానీ చేతిలో పెట్టాను.

"నీకీ ఎక్కడియి ఇన్ని రూపాల్?" అని అరిచాడు.

"తర్వాత చెప్తా .. ముందు ఇచ్చెయ్."

"రేయ్.. సువర్‌కి బచ్చా..లుచ్చా..." అని యతీ ప్రాసతో తిట్టుకుంటూ, తూలుతూనే, ప్యాంట్ కున్న బెల్ట్ తీస్తూ సందానీ తండ్రి మాకేసి వస్తూ కనిపించాడు.

సందానీ గడగడ వణుకుతూ "లేలో పైసా.. మత్ మారో" అంటూ ఐదు రూపాయిలు తండ్రి చేతిలో పెట్టాడు.

సందానీ తండ్రి ఐదు రూపాయిలు అటూ ఇటూ తిప్పి చూసి "గదా కీ ఔలాద్... సువర్‌కి బచ్చా..." అంటూ మళ్ళీ సందానీని లాగి కొడ్తున్నాడు. ఈ తిట్లన్నీ నిజ్జంగా నిజం....వాడు "సువర్‌కీ బచ్చా... గదా కి ఔలాద్"

"ఎందుకు కొడ్తున్నయ్?" అడిగాడు సందానీ.

"నాలుగు రూపాయిలు పోయినయ్.. ఐదు ఏడకెల్లి వచ్చినయ్ రా? చోరీ చేసినవా? అని బెల్ట్ తీసాడు. మరో నిమిషంలో, ఆ బెల్ట్, బకిల్ సందానీ వీపు మీద వాతలు తేలేట్లు దెబ్బలు పడ్తాయి అని, అదిరే గుండెతో, బిక్క చచ్చిపోయి నేను చూస్తున్నా. ఇంతలో సందానీ తండ్రి చేతిని ఒక చెయ్యి గట్టిగా పట్టుకుని ఆపింది. ఆ చెయ్యి సలీంది.

"క్యారే? మార్ దేతా క్యా? సువర్. అకల్ నయ్యే క్యా గదా?" అని అరిచాడు.

సందాని తండ్రికీ సలీం అంటే భయమేననుకుంట. "నహీ సలీం భాయ్. ఏ బద్మాష్ చోరీ కియా. చార్ రుపాయ్ పోతే, పాంచ్ రుపయ్ దేరా మేరాకో.." అని తడబడ్తూ చెప్పాడు.

సలీం అతని కాలర్ పట్టి సరిగ్గా నిలబెట్టి, "అరే బేవ్‌కూఫ్ ఈ చిన్నపిల్ల ఇచ్చిందిరా మీ ఓనికి డబ్బులు. నేనంతా విన్నా. పిల్లలు తప్పులు చెయ్యకుంటే ఎవరు చేస్తారురా? పో.. ఇంటికి పో. జేబుల డబ్బులు పడ్తే చాలు తాగనీకి సారా దుకాన్‌ల దూర్తావే. నువ్వు పిల్లగాడికి ఏం బుద్ధి చెప్తావురా?" అని తిట్టాడు.

నాకైతే సలీం, కృష్ణావతారంలో లాస్ట్ సీన్‌లో విశ్వరూపం చూపిస్తునట్లు అనిపించాడు.

సందానీ తండ్రి వంచిన తల ఎత్తలేదు "అచ్చా భాయ్. ఖుదాఫీస్.. అని "పదరా" అని సందానీతో, నా ఐదు రూపాయల నోటుని నా చేతిలో పెట్టి "బేటీ వీనికి పైసలు ఇయ్యకు" అన్నాడు.

నేను తలవూపాను.

సలీం "చాక్లెట్ లేలో బేబీ" అని చాక్లెట్ ఇచ్చాడు నాకూ సందానీకీ.

తీసుకుని "థాంక్స్ అంకుల్" అన్నాను నవ్వుతూ.

ఇంకెప్పుడూ మళ్ళీ సలీం మర్రిచెట్టుకానీ, అతని మాంసం కొట్టుకానీ రాక్షసుడిని గుర్తు చెయ్యలేదు.

ఇంక ఆ మరుసటి ఆదివారం నేనూ బుజ్జీ, చిట్టీ, వినోలియా, సందానీ, శ్యామలమ్మా సువర్ణసుందరి సినిమాకి ఆనందంగా వెళ్ళాం.

నేను ఇటీవల 69వ NFA అంటే 2023 నేషనల్ ఫిల్మ్ అవార్డ్సు జ్యూరీ మెంబర్ గా వెళ్ళినప్పుడు పిల్లల సినిమాలు చాలా చూసాను. అందులో పిల్లల మనోభావాలు కానీ, చిన్నచిన్న భయాలూ, చిన్నతనంలో భయాలూ సరిగా డైరెక్టర్స్ బహిర్గత పరచలేకపోయారనిపించింది. పెద్దవాళ్ళ కథలు చిన్నపిల్లలని పెట్టి తీస్తే అవి బాలల చిత్రాలు అయిపోవు. వారి మనస్సులతో ఆలోచించాలి.


సత్యజిత్‌రే అంత గొప్ప దర్శకులు మళ్ళీ పుట్టరేమో అనిపించుకున్నారంటే ఇదే కారణం. అప్పూ ట్రయోలజీగా భిభూతి భూషణ్ రాసిన పథేర్ పాంచాలీ, అప్పూ సంసార్, అపరాజితో, లు సినిమాలుగా తీసి పిల్లల మనస్సులు తెరమీద పరచడం వల్లనే ఇప్పటికీ అవి మన మనసుల్లో నిలిచిపోయాయి.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4